## క్లుప్తంగా

### నేడు పవనగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

**అడ్డతీగల:** గురుపౌర్ణమి వేడుకలను సోమవారం పవనగిరి క్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్టు క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. సదానంద సరస్వతి స్వామి వారి దివ్య పాదుకలకు రుద్రాభిషేకం, కుంకుమార్చన, భువనే శ్వరి అమ్మవారికి ఖడ్గమాలార్చన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. పలు గ్రామాల భజన బృంద సభ్యులకు సామగ్రి, విగ్రహమూర్తుల వితరణ చేస్తామన్నారు.

### టీచర్ మృతికి సంతాపం


ప్రభావతి(ఫైల్)

**జి.మాడుగుల:** మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ప్రభావతి అధిక రక్తపోటుతో ఆదివారం మృతి చెందారు. వారంరోజుల కితం అధిక రక్తపోటు కారణంగా చికిత్స నిమిత్తం విశాఖ కెజీహెచ్‌కు తరలించామని, ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. టీచర్ ప్రభావతి మృతి చెందడంతో ఆశ్రమ పాఠశాలలో విషాదఛాయలు నెల కొన్నాయి. ఉపాధ్యాయురాలు ప్రభావతి మృతికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

### లోకులగాంధీ సేవలు మరువలేనివి


అన్నదానం చేస్తున్న యువకులు

**చింతపల్లి:** బీజేపీ నాయకుడు లోకుల గాంధి జయంతి సందర్భంగా స్థానిక యువకులు అనాథ పిల్లలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో నల్లబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. బీజేపీ నాయకుడు శేఖర్ మాట్లాడుతూ లోకులగాంధీ చేసిన సేవలు మరువలేనివన్నారు. రమణ, గిరి, రాజేష్, లోవరాజు, శివ పాల్గొన్నారు.

### ఎంఈవోగా బాబూరావుపడాల్

**జి.మాడుగుల:** మండల విద్యాశాఖ అధికారిగా చిట్టపులి బాబూరావు పడాల్ నియామకమయ్యారు. హుకుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన కౌన్సిలింగ్‌లో జి.మాడుగుల ఎంఈవోగా బాబూరావు పడాల్‌ను పదోన్నతి కల్పించి నియమించారు. ఇక్కడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి ఇన్‌చార్జి ఎంఈవో పనిచేశారు. అయితే కౌన్సెలింగ్‌లో కృష్ణమూర్తికి ముంచంగిపుట్టు ఎంఈవోగా పదోన్నతి కల్పించారు.

### రోడ్డు పనుల పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నేత రాజారావు తదితరులు

**ముంచంగిపుట్టు:** రంగబయలు పంచాయతీ కేంద్రం నుంచి జోడిగుమ్మ వరకు వేసిన తారురోడ్డును బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించడంతో వర్షాలకు రోడ్లు కోతకు గరైనట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు లక్ష్మణరావు, సుబ్బారావు, నాగేశ్వరరావు, బాబు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

**కె.కోటపాడు:** మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.హనుమంతరావు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా మహేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వీరాచారి, కార్యదర్శిగా గోవింద, కోశాధికారిగా వరహాలరాజు ఎన్నికయ్యారు. వీరిని అనకాపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బి.రాజేష్, ఈశ్వరరావు, నానాజీ తదితరులు అభినందించారు. పలువురు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.



# వేరుశనగ సాగు.. లాభాలు బాగు

- ముందస్తు దిగుబడి
- వారపు సంతల్లో భారీగా అమ్మకాలు
- ఆశాజనకంగా ధరలు
- ఆనందంలో గిరిజనులు


వేరుశనగకాయలు


వేరుశనగ పంటను సేకరిస్తున్న గిరిజన మహిళలు

**సాక్షి, పాడేరు:** ఏజెన్సీలో వేరుశనగ దిగుబడులు ముందస్తుగానే ఏర్పడ్డాయి. పంటను సేకరిస్తున్న గిరిజన రైతులు వెనువెంటనే వారపు సంతల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. గుత్తులపుట్టు, హుకుంపేట, కించుమండ, అరకు వారపు సంతల్లో గత రెండు వారాల నుంచి గిరిజన రైతులు వేరుశనగను అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం 40 కిలోల బస్తాను రూ.1000తో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వేరుశనగ పంటకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. పాడేరు డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఏప్రిల్, మే నెలల్లో కురిసిన వర్షాలతో గిరిజన రైతులు ముందస్తుగానే మెట్ట,పల్లపు భూముల్లో దుక్కిపనులు చేపట్టారు. మూడు నెలల సమయంలో దిగుబడికి వచ్చే వేరుశనగ పంటకు సంబంధించి ఆయా భూముల్లో వేరుశనగ విత్తనాలను జల్లుకున్నారు. ప్రభుత్వం కూడా వ్యవసాయశాఖ ద్వారా వేరుశనగ విత్తనాలను గిరిజన రైతులకు సబ్సీడీపై ముందుస్తుగానే పంపిణీ చేసింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1313 హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ పంటను రైతులు ఖరీఫ్‌లో పండిస్తున్నారు. పాడేరు డివిజన్‌కు సంబంధించి 600 హెక్టార్ల వరకు ఈ ఏడాది సాగు చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే వ్యవసాయశాఖ కె-6 విత్తనాలను 1023 క్వింటాళ్లు, లేపాక్షి రకం 593 క్వింటాళ్లను జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసింది. ప్రస్తుతం ముందస్తుగా విత్తనాలు జల్లిన చోట పంట ఆశాజనకంగా ఎదగడంతో వేరుశనగకాయలను సేకరించి అమ్మకాలు జరుపుతున్నారు. ఏజెన్సీ వేరశనగ కాయలకు మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. మైదాన ప్రాంత వ్యాపారులు సంతలకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అక్టోబర్ నెలాఖరు వరకు వేరుశనగ కాయల సీజన్ మన్యంలో ఉంటుంది. వేరుశనగ పంట ప్రతి ఏడాది ఖరీఫ్‌లో గిరిజన రైతులకు మంచి ఆదాయాన్నిస్తుంది. ప్రస్తుతం ధరలు బాగున్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

# వెల్లివిరిసిన ఆధ్యాత్మికత


మోదమ్మతల్లి ఆలయంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న దాతలు, కమిటీ సభ్యులు


రాజవొమ్మంగిలో బాబా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

**సాక్షి, పాడేరు:** ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానికంగా ఉన్న భక్తులు కూడా ఘటాలను పాడేరులో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఇంటి పండగలతో భక్తులు సందడి చేశారు.అలాగే పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు వద్ద భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. ఇక్కడ తోటల్లోనే వంటలు చేసుకున్నారు. పాడేరు మోదకొండమ్మతల్లి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నసమరాధన కార్యక్రమానికి భక్తుడు కంటెంట్ శ్రీను సహకారం అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ప్రసాదాల కమిటీ ప్రతినిధులు ముకుందరావు, శ్రీనివాసరావు, వెంకటరత్నం, గోవిందరావు, దేముడు, రామారావు, అప్పలరాజు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా షిర్డీ సాయిబాబా ఊరేగింపు**

**రాజవొమ్మంగి:** గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా రాజవొమ్మంగిలో స్థానిక షిర్డీ సాయిబాబా విగ్రహాన్ని పల్లకిలో ఆదివారం వైభవంగా ఊరేగించారు. తొలుత భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భాజాభజంత్రీలు, కోలాట నృత్యాలతో, భజనలు చేస్తు భక్తులు వీధివీధిలో బాబా వారిని ఊరేగించారు. గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం బాబా ఆలయంలో వేకువ జాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

## జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

**జి.మాడుగుల:** మండలంలో ఈ నెల 3 నుండి 24వ వరకు జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాలకు మండల స్థాయి అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో చంద్రశేఖరరావు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించవచ్చన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

**కొయ్యూరు:** రాజేంద్రపాలెం, చిట్టింపాడు గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని వారి సమస్యలను తెలపాలని కోరారు. దరఖాస్తు చేసిన వారికి ధ్రువపత్రాలను త్వరితగతిన అందజేయనున్నట్టు తెలిపారు.

**అడ్డతీగల:** మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఇప్పటికే గ్రామ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి సేకరించిన దరఖాస్తులకు ధ్రువపత్రాలతో పాటు ఇతరత్రా అంశాల పరిష్కారానికి ఈ సమావేశంలో వివరాలను వెల్లడిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 23న గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలు


సమావేశమైన ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నాయకులు

**పాడేరు రూరల్ :** ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలు ఈ నెల 23న పాడేరులోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ తెలిపారు. తలార్‌సింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ఇండోర్ స్టేడియంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్తాడి రామారావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా కార్యవర్గ కాల పరిమితి ముగియడంతో కొత్తగా అల్లూరి జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలతో పాటు భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. సంఘం ప్రతినిధులు పి.కృష్ణారావు, శ్రీనివాసపడాల్, హెచ్‌ఎంల సంఘం గౌరవ అధ్యక్షుడు రీమలి జాన్, జి.వి.వి.ప్రసాద్, కె.నీలకంఠం, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటికి తప్పని ఇక్కట్లు

దెబ్బతిన్న పైపులైన్


బంగారుమెట్ట సమీపంలో దెబ్బతిన్న పైపులైన్

**పెదబయలు:** మండలంలోని సీతగుంట, అరడకోట, సీకరి పంచాయతీల పరిధిలోని సుమారు 14 గ్రామాలకు తాగునీరు అందించే తాగునీటి పైలట్ ప్రాజెక్టు గత వారం రోజుల నుంచి పైపులైన్ దెబ్బతినడంతో తాగునీరు అందడం లేదని గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. సీతగుంట పంచాయతీకి సురక్షిత నీరు అందించే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం సుమారు రూ.5.30 కోట్ల మంజూరయ్యాయని, అయినా సక్రమంగా నీరందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రామస్తులు స్థానిక నీటి పారుదల శాఖ అధికారులకు స్థానికులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాడైన పైపులైన్ బాగుచేసి, గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కురేష్ ను సాక్షి వివరణ కోరగా పైపులైన్ తెగిపోయిందని.గత వారం వర్షం కారణంగా మరమ్మతులు చేయడానికి వీలుపడలేదని మరమ్మతు పనులు చేపట్టి, నీరు అందిస్తామని తెలిపారు.

# ఘనంగా గిరి ప్రదక్షిణ


తోటాడలో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

**మునగపాక :** మండలంలోని తోటాడలో ఆదివారం గిరి ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. తోటాడలోని శ్రీ ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఓంకార పీఠం నుంచి భక్తులు భజనలు చేస్తూ త్రిమూర్తుల ఆలయం, పాటిపల్లి కాలనీ, వరాహనరసింహ స్వామి ఆలయం, నారాయుడుపాలెం మీదుగా ఓంకార పీఠం వరకు ఊరేగింపు నిర్వహించారు. కాగా సోమవారం ఆలయ ప్రాంగణంలో గురుపౌర్ణమి సందర్భంగా భారీ అన్న సమారాధన జరుగుతుందని మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుకుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మునగపాకకు చెందిన పెంటకోట రామయ్య కుటుంబ సభ్యులు గిరి ప్రదక్షిణలో భాగంగా విశాఖలో భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు.

## 70 మందికి నేత్ర పరీక్షలు

**రోలుగుంట:** శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో కుసర్లపూడిలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 70 మంది రోగులకు వైద్యులు రమేష్, హరికృష్ణ పరీక్షలు చేశారు. వారిలో 35 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఇక్కడ ఏర్పాట్లు చేసిన సర్పంచ్ మడ్డు అప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు ఎమ్మెల్యేల పర్యటన

**జి.మాడుగుల:** మండలంలో వంతాల గ్రామంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సోమవారం పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. ఇందులో భాగంగా వంతాల సచివాలయంలో ఉదయం 11 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు సొలభం సచివాలయం-1 పరిధిలో సొలభం, సొలభం కాలనీ, తోటలగొంది, కుడ్డంగి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, నాయకులు, వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు వైస్ ఎంపీపీ, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

**వై.రామవరం:** మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం మధ్యాహ్నం నుంచి పర్యటించనున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురా లు కర్ర వెంకటలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పి.యర్ర గొండ గ్రామ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో నూతన భవన నిర్మా ణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం యార్లగడ్డ సచివాలయం పరిధిలోని గ్రామా ల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మండల ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ ఇన్‌చార్జిలు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

## జగనన్న సురక్షపై అవగాహన


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి

**డుంబ్రిగుడ:** మండలంలో సొవ్వ పంచాయతీ ఒడియావలస, మాలివలస గ్రామాల్లో ఎంపీపీ బాక ఈశ్వరి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి కుల, ఆదాయ, నివాస, జనన తదితర ధ్రువపత్రాలను ఉచితంగా త్వరితగతిన పొందవచ్చన్నారు. వీటితో పాటు ఈ కార్యక్రమం ద్వారా పలు సేవలను ఇంటివద్దకే అందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ సర్వేకు వచ్చినపుడు అవసరమైన పథకాలపై సమాచారం అందించాలన్నారు. నాయకులు సింహాచలం , నర్సింగరావు, తిరుపతి, గ్రామ వలంటీర్లు కృష్ణ, కూల్‌ధర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేతలు

**అరకులోయ రూరల్:** మండలంలో మాడగడ పంచాయతీ ఎం.హట్టగుడ గ్రామనికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పడాల సుంద్ర(50) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత లు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు మృతుడి స్వగ్రామానికి వెళ్లారు. సుంద్ర భౌతికదేహానికి పూల మాలల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభు త్వం నుంచి రావల్సిన సహాయం సకాలంలో అందే విధంగా కృషి చేస్తామన్నారు. మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, నాయకులు బాలరాజు, నర్సింగ్, నగేష్, లక్ష్మణ్, అర్జున్, పైడన్న తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం


గాలిపాడు గ్రామంలో బోరుబావి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకుడు మత్స్యరాజు


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎస్‌ఐ అరుణ్ కిరణ్

**జి.మాడుగుల:** మండలంలో వంజరి పంచాయతీ గాలిపాడు గ్రామంలో బోరు బావి పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండపల్లి మత్స్యరాజు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అరకు ఎంపీ గొడ్డేటి మాధవి చొరవతో బోరుబావికి నిధులు మంజూరైనట్టు చెప్పారు. దీంతో గ్రామంలో నీటి సమస్య పరిష్కరమైనట్టు తెలిపారు. నాయకులు కొండపల్లి రాజు, ప్రవీణ్‌సాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

**చింతపల్లి రూరల్:** మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ వద్ద బోరుబావి నిర్మాణానికి ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ బోరు ఏర్పాటుకు ఎంపీపీ అనూషదేవి రూ. 2 లక్షలు ఎంపీపీ నిధులను సమకూర్చినట్టు ఆయన తెలిపారు.

# జేసీఎస్ కన్వీనర్ల నియామకంపై హర్షం


పండా రామకృష్ణదొర


కరణం కనకరాజు

**రంపచోడవరం:** రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడవరం, గంగవరం, వై.రామవరం మండలాలకు జేసీఎస్ మండల కన్వీనర్లను పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల జేసీఎస్ మండల కన్వీనర్లుగా పండా రామకృష్ణ, మాగంటి శ్రీను, కరణం కనకరాజులు నియామకమయ్యారు. ఈ సందర్భంగా వారు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఈ మేరకు జేసీఎస్ కన్వీనర్లుగా ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జేసీఎస్ కన్వీనర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశం కల్పనకు మార్గాన్ని సుగమం చేసిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్యే అనంతబాబులకు ధన్యవాదాలు తెలియజేశారు. నాయకులు, కార్యకర్తలతో సమష్టిగా పనిచేసి పార్టీ మరింత బలోపేతానికి ఎనలేని కృషి చేస్తామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా జేసీఎస్ కన్వీనర్‌లకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు అభినందనలు తెలిపారు. రంపచోడవరం జేసీఎస్ కన్వీనర్ పండా రామకృష్ణకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

**గంగవరం:** మండల జేసీఎస్ కన్వీనర్‌గా నియామకమైన మాగంటి శ్రీనుకు ఎంపీపీ కృష్టారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, మండల కన్వీనర్ సీహెచ్. రఘునాథ్ తదితరులు అభినందనలు తెలిపారు.

**వై.రామవరం:** మండల జేసీఎస్ కన్వీనర్‌గా నియామకమైన కరణం కనకరాజుకు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి తదితరులు అభినందనలు తెలిపారు.

## వరి విత్తనాల పంపిణీ

**నాతవరం:** రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అన్నారు. చమ్మచింత రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై ఖరీఫ్ వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతుల కష్టాలు తీరాయన్నారు. సకాలంలో వారి ఇంటి వద్దకు వరి విత్తనాలు అందిస్తున్నామన్నారు. మే నెలలో వ్యవసాయ పెట్టుబడి కింద రైతు భరోసా సాయాన్ని అందించామన్నారు. గత టీడీపీ హయాంలో కల్తీ విత్తనాల విక్రయించడంతో రైతులు నష్టపోయేవారన్నారు. సాగు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు తెచ్చేవారన్నారు. ఇప్పుడు ఇటువంటి ఇబ్బందులు లేవన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

# జీడిమామిడి మొక్కల పంపిణీ


జీడిమామిడి మొక్కలను రైతులకు అందజేస్తున్న దృశ్యం

**రాజవొమ్మంగి :** ఉపాధి హామీ పథకంలో ఉద్యానవనాలను సాగుచేస్తున్న రైతులకు రాజవొమ్మంగి వాల్మీకినగర్ వద్ద ఉచితంగా జీడిమామిడి మొక్కల పంపిణీ ఆదివారం జరిగింది. ఉపాధి ఏపీఓ సురేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని 150 ఎకరాల్లో జీడిమామిడి తోటలు పెంచుతున్న 124 మంది రైతులకు మొక్కలు అందజేసినట్టు తెలిపారు. రైతులకు మొత్తం 10,500 జీడిమామిడి, ఆయిల్‌పామ్, కొబ్బరి, నిమ్మ మొక్కలు అందజేశామన్నారు. ఈ మొక్కలు కడియం నర్సరీ నుంచి వచ్చాయన్నారు. మొక్కల పెంపకానికి ప్రభుత్వం మూడు సంవత్సరాలలో ఎకరాకు రూ.లక్ష ఉపాధి నిధులు విడతల వారీగా విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఆయా నిధులతో నేల దున్నడం, గుంతలు తవ్వడం, మొక్కలు పరిరక్షణ చర్యలు, నీటి సరఫరా తదితర పనులను రైతులు పాటించాలన్నారు. మొక్కలు ఎన్ని బ్రతికాయో లెక్కకట్టి దశల వారీగా నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు.

## హరివిల్లు... కనువిందు


ఆకాశ వీధిలో అందాల హరివిల్లు అందరినీ అలరించింది. జి.మాడుగులలో సోమవారం సాయంత్రం 6:30గంటలకు ఆకాశంలో కనిపించిన ఇంద్ర ధనస్సు స్థానికులు మనస్సులను ఉల్లాసపరిచింది. ఈ ప్రాంత ప్రజలు అందాల హరివిల్లును చాలాసేపు వీక్షించి సెల్‌ఫోన్లలో బంధించారు.
జి.మాడుగుల